వ్యవసాయంపై ఆసక్తి

● పెరుగుతున్న కౌలు రైతులు
● భూముల ధరలకు రెక్కలు

మునిపల్లి(అందోల్): వ్యాపారులు, ఉద్యోగులు, ఆర్థికంగా స్థిరపడిన వారు వ్యవసాయంపై అనుభవం లేని వారు భూములను కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయంపై ఆసక్తి పెంచుకుంటున్నారు. వీరంతా ఆ భూములను కౌలుకు ఇస్తున్నారు. ఈ విషయంలో వ్యవసాయ విస్తీర్ణం పెరగకపోయినా భూములను మాత్రం కొని వ్యవసాయం సాగిస్తున్నారు. దీంతో కౌలు రైతుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాల్లోని ఆయా గ్రామాల్లో నల్లరేగడి భూముల ధరలు సుమారు రూ.60 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ఉంటోందని చెబుతున్నారు. 65నంబర్ జాతీయ రహదారి సమీపంలో గ్రామాల్లో ఎకరం భూమి సుమారు కోటి రూపాయల పైనే ఉంది. వ్యాపారులు లాభార్జనకు మారుమూల గ్రామాల్లో భూములను కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. జాతీయ రహదారి సమీపంలోఎకరా భూమి అమ్మి, మారుమూల గ్రామాల్లో 2 నుంచి 3 ఎకరాల భూమి కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయ భూములపై వ్యాపారులకు మక్కువ పెరగడంతో భూములు ధర అమాంతంగా పెరుగుతుంది. 11 సంవత్సరాల క్రితం సుమారు ఎకరా భూమికి రూ.40నుచి 50వేలు ఉండేది.



బోరు మోటర్ దగ్గర కూరగాయల సాగు చేస్తున్న రైతు

ఇప్పుడు అదే భూమి అమాంతం పెరిగిపోయింది. దీంతో వివిధ రకాల వ్యాపారస్తులు భూములను కొనుగోలు చేసి కౌలుకు అప్పగిస్తున్నారు. పట్టణాల్లో వ్యవసాయ భూములు ఇళ్ల స్థలాలుగా మారుతుండడంతో ఆ భూములను అమ్ముకుని మారుమూల గ్రామాల్లో వ్యవసాయ భూములను ఎకరాల్లో కొనుగోలు చేస్తున్న సందర్భాలు అనేకం కనిపిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఇలాంటి భూముల విషయంలో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం ఉంటే ఆ భూముల ధరలు రెండింతలు పలుకుతుంది. వ్యవసాయానికి కొనుగోలు చేసిన భూములను ఎకరాకు సుమారు రూ.25 వేల నుంచి రూ.28 వేల వరకు కౌలుకు ఇస్తున్నారు. భూగర్భ జలాలు అందుబాటులో ఉన్న వ్యవసాయ భూములపై కొనుగోలు దారులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. పట్టణాల్లో స్థిరపడిన వారు పల్లెలపై దృష్టి సారిస్తుండడంతో వారు ఎక్కువగా వ్యవసాయ భూములను కొనుగోలు చేసి కౌలుకిస్తున్నారు.

భూములకు డిమాండ్



భూములకు డిమాండ్ పెరగడంతో భూస్వాములు కౌలుపెంచి వ్యవసాయం చేయించుకుంటున్నారు. కౌలు డబ్బులు ముందే అడ్వాన్సుగా యజమానులకు కౌలుదారులు చెల్లిస్తున్నారు.

మల్లారెడ్డి, పెద్దాపూరం

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరకల్పించి ఆదుకోవాలి. పంటలకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవల్సి వస్తుంది.

బసప్పా, హైద్లాపూర్

అంతర పంటలతో అధిక లాభం



ఒకే పంట వేయకుండా అంతర పంటలు వేయడం వల్ల అధిక లాభాలు ఆర్జించవచ్చు. అంతర్ పంటలు వేయడం వల్ల అధికదిగుబడి వస్తుంది. ఒక పంట దెబ్బతిన్న మరో పంట చేతికొస్తుంది. రైతులు ఒకే పంట వేస్తే ఎక్కువ నష్టం వస్తుంది.

నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

వీఆర్‌ఏల సమస్యలు చర్చించాలని వినతి

జహీరాబాద్ టౌన్: అసెంబ్లీ సమావేశాల్లో వీఆర్‌ఏల సమస్యలు చర్చించాలని కోరుతూ ఎమ్మెల్యే మాణిక్‌రావుకు గ్రామ సేవకులు గురువారం వినతి పత్రం అందజేశారు. వీఆర్‌ఏల జేఏసీ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా నాగరాజ్ మాట్లాడుతూ వీఆర్‌ఓ వ్యవస్థ రద్దైన తరువాత రెవెన్యూ శాఖకు సంబంధించిన పనులను తామే నిర్వహిస్తున్నామన్నారు. తమను రెగ్యులర్ చేసి పదోన్నతులను కల్పించాలని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని వీఆర్‌ఏలు పేర్కొన్నారు.

జోగిపేట(అందోల్): వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని గురువారం స్థానిక ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర కన్వీనర్ బైండ్ల రమేష్ మాట్లాడుతూ కొత్త రెవెన్యూ చట్టం 2020 వీఆర్‌ఓ వ్యవస్థ రద్దు, వీఆర్‌ఏ లందరికీ పే స్కేలు కల్పిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం వీఆర్‌ఏల సర్వీస్ రూల్స్ రూపొందించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ సమస్య పరిష్కరించాలని కోరారు. ఆయన వెంట వీఆర్‌ఏ సంఘం నాయకులు భిక్షపతి, బాలయ్య, నర్సింలు, లక్ష్మి, మల్లేశ్వరి, మంజుల, సరిత తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మాణిక్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్‌ఏలు

పేదలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పేదలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీకు చెందిన తులసి అనారోగ్యంతో బాధపడుతుంది. మెరుగైన చికిత్స కోసం రూ.2 లక్షల 50వేలు ఎల్‌ఓసి పత్రాలను వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, పరమేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

నియోజకవర్గంలో గ్రంథాలయల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం రామచంద్రాపురంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ నరహరి రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతి ఏటా ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్లు విడుదల అవుతున్నాయని, వాటికి అనుగుణంగా నిరుద్యోగుల కోసం పోటీ పరీక్షల పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో ఆధునిక నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప నగేశ్, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కుమార్ గౌడ్, నాయకులు బూరుగడ్డ నగేష్, ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఓసీ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నాణ్యతలేని పనులపై చర్యలు తీసుకోవాలి

జోగిపేట(అందోల్): మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో చేపడుతున్న నాణ్యతలేని పనులపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ మాజీ ఏఎంసీ చైర్మన్ డీబీ నాగభూషణం, బీఆర్‌ఎస్ మాజీ పట్టణ అధ్యక్షుడు చాపల వెంకటేశం, మాజీ కౌన్సిలర్ తుపాకుల సునీల్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపాలిటీలో చేపట్టిన నాణ్యతలేని పనులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపాలిటీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణ పనుల్లో నాణ్యత లేవన్నారు. ఈ కార్యక్రమంలో అల్లె గోపాల్, మాజీ నీటి సంఘం చైర్మన్ ఉల్వాల మాణయ్యలు వారి వెంట ఉన్నారు.



మున్సిపల్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

భక్తి శ్రద్ధలతో మహా పడిపూజ

నారాయణఖేడ్: పట్టణంలోని కాశీనాథ్ ఆలయంలో భక్తిశ్రద్ధలతో మహాపడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా లలితాంబిక దేవి ఉపాసకులు శ్రీపంతులు శివపూజ విశేషాలను వివరించారు. అర్చకులు మోహన్ జ్యోషి ఆధ్వర్యంలో గురు స్వాములు నాగొెట్టి, శ్యాంరావు పటేల్, సుభాష్, విఠల్, జగన్, మధు, శ్రీనివాస్, శ్రీకాంత్, అశ్కో, గిరి, రమేష్ చారి, పాల్గొన్నారు.



మహా పడిజలో శివస్వాములు

క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి కృషి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: గ్రామాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి తెలిపారు. నిజాంపేట్‌లో రూ.50లక్షలతో ప్రత్యేక అభివృద్ధి, ఉపాధి హామీ నిధులతో కొత్తకాలనీ, నీరుడిగల్లీల్లో మురుగు కాలువలు, శాలివాహన, అంబేడ్కర్ భవనాలు, పాత పంచాయతీ భవనం నుంచి శివాజీ విగ్రహం వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు గురువారం ఆయన భూమిపూజ చేశారు. డీపీఓ సురేష్ మోహన్, మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, సర్పంచ్ జగదీశ్వరాచారి, ఉప సర్పంచ్ రాంచందర్ రావు, నాయకులు రమేష్ చౌహాన్, రాజునాయక్ పాల్గొన్నారు.

క్రీడలతోనే ఆరోగ్యం



క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న బసవరాజ్ పాటిల్

రాయికోడ్(అందోల్): క్రీడలతోనే ఆరోగ్యంగా ఉండోచ్చని సర్పంచ్ సంగమేశ్వర్ పాటిల్ అన్నారు. మహమ్మదాపూర్ గ్రామంలో ఆయన క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు అనంతరం సీఎం కేసీఆర్ హరితహారం, పల్లె ప్రగతి, కార్యక్రమాలు చేపట్టి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయడమే కాకుండా క్రీడలకు పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ దుర్గయ్య, కార్యదర్శి లక్ష్మణ్, హెచ్ఎం యాదవులు, నాయకులు రాజారామ్, మారుతి పాటిల్, స్థానికులు అశోక్, అంజన్న, స్వామి తదితరులు ఉన్నారు.

నేటి నుంచి న్యాల్‌కల్‌లో ఉర్సు



ఉర్సు ఉత్సవాలకు ముస్తాబైన దర్గా

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లో ఉర్సు ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. శుక్రవారం నుంచి సర్కారి గంధం తీయబడును. 4న హద్నూర్‌లో జరగవలసిన కూరగాయల సంత ఉత్సవాల్లో జరుగును. ఝరాసంగం, రాయికోడ్ తదితర గ్రామాల నుంచి గంధం ఇక్కడికి తీసుకవస్తారు.

మీట్ మార్కెట్ అభివృద్ధికి కృషి



మీట్ మార్కెట్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప నగేశ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మీట్ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ తెలిపారు. గురువారం రామచంద్రాపురంలోని మీట్ మార్కెట్ అభివృద్ధికి అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడల్ మీట్ మార్కెట్‌ను రెండంతస్తుల్లో అభివృద్ధి చేస్తునట్లు తెలిపారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు.

మృతుడి కుటుంబానికి సాయం



మృతుడి కుటుంబానికి నగదు అందిస్తున్న స్థానిక నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): విద్యుద్ఘాతానికి గురై మృతి చెందిన ఓ వ్యక్తి కుటుంబానికి గురువారం ఎమ్మెల్యే సోదరుడు మధుసూదన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆర్థిక సాయం అందజేశారు. జంగంపేట గ్రామానికి చెందిన అల్లం రాజు ఇటీవలే విద్యుద్ఘాతానికి గురై మృతి చెందిన విషయాన్ని స్థానిక నాయకుల ద్వార విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోదరుడు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి మృతుడి కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్ వెంకటయ్య, ఉపసర్పంచ్ గోవర్ధన్ రెడ్డి, వార్డు సభ్యుడు శంకరప్ప, దుర్గేష్, మహేష్, నర్సింహ్మ పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే సహకారంతో డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలో బండ్లగూడలోని స్మశాన వాటిక, ఆల్విన్‌కాలనీలో నూతనంగా నిర్మించబోయే జీహెచ్ఎంసీ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ స్థలంను, అదేవిధంగా పటాన్‌చెరు పాత మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌ను తొలగించి దాని స్థానంలో మార్కెట్ షెడ్లను నిర్మించే ప్రక్రియలో భాగంగా జీహెచ్ఎంసీ ఏఈ శివకుమార్, ప్రైవేట్ కన్సల్టెంట్‌లతో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్ మాట్లాడుతూ...డివిజన్‌లో మూడు చోట్ల చేపట్టే పనులకు ప్రైవేట్ కన్సల్టెంట్‌తో చర్చించి నమూన డ్రాయింగ్ గీయించి, ఎమ్మెల్యేకు అందజేస్తానని తెలిపారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శ్రీ షిరిడి సాయి బాబా 21వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. బాబాకు ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5.15 గంటలకు మేలు కొలుపు హారతి, 6 గంటలకు సుప్రభాత సేవా, 7 గంటలకు అభిషేకం, 8 గంటలకు బాబా జీవిత చరిత్ర అఖండ సామూహిక పారాయణ పఠనం, 8.30 గంటలకు సామూహిక సాయి సత్యవ్రతాలు, 11.30 గంటలకు స్వామి వారికి మహానైవేద్యం, మధ్యాహ్నం 12 గంటలకు షిరిడి తరహాలో హారతి, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. 6.15 గంటలకు సంధ్యా హారతి నిర్వహించారు.

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఇబ్రితాబాద్‌లోని సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సమయంలోనే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోడూరి రాములు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

'విద్యా రంగానికి నిధులు కేటాయించాలి'

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డిలోని జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ 3నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాల్లో 30% నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం 17% కేటాయించగా, తెలంగాణ ప్రభుత్వం 7% మాత్రమే కేటాయిస్తుందన్నారు. రాష్ట్రంలో ఇంతవరకూ (డీఎస్సీ) టీచర్ ఉద్యోగాల భర్తీ లేదు. గురుకులాల్లో టీఆర్‌టీ భర్తీ పేరిట కాలయాపన చేస్తున్నారన్నారు. కొఠారి కమిషన్ ప్రకారం ఖచ్చితంగా మొత్తం బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రసాద్, సంతోష్, అర్షద్, ఆకాష్, రామకృష్ణ, సిద్దు, శ్రీనాథ్, సుభాష్, నర్సింలు, నవీన్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేశ్

సంక్షిప్త వార్తలు

◆ **ఎస్టీయూ కేలండర్ ఆవిష్కరణ**

పటాన్‌చెరు టౌన్: ఎస్టీయూ నూతన కేలండర్‌ను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి గురువారం క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్, రామచంద్రాపురం మండల అధ్యక్షుడు విజయ్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినోద్, ప్రకాష్, జిల్లా ఉపాధ్యాక్షుడు ప్రతాపరెడ్డి, రాజిరెడ్డి, ఈశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

◆ **37 మందికి కోవిడ్ టెస్టులు**

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 37 మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు.

◆ **ఆహ్వాన పత్రిక అందజేత**

పటాన్‌చెరు: శ్రీ దత్తగిరి మహరాజ్ శతజయంతి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని బర్దిపూర్ ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి అవదూత గిరి మహరాజ్ ఆహ్వాన పత్రికను అందించారు. మార్చి 9వరకు శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

◆ **డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం నేడు ధర్నా**

జహీరాబాద్ టౌన్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ కోరారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు తిరుపతి, సలీమొద్దీన్, యాదల్ తదితరులు పాల్గొన్నారు.

◆ **శ్రీశైలంకు శివస్వాములు**

మునిపల్లి(అందోల్): శివస్వాములు శ్రీశైలంకు తరలివెళ్లారు. గురువారం పిల్లోడి గ్రామానికి చెందిన శివస్వాములు హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడి తీసుకుని పాదయాత్ర ప్రారంభించారు.

◆ **ఆందోళనలో రైతులు**

మునిపల్లి(అందోల్): పత్తి ధర పెరుగుతుందని ఆశలో ఉన్న రైతులకు పత్తి ధర రోజు రోజుకు తగ్గుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నట్లు కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి పెద్దలోడి బస్వరాజ్ పటేల్ గురువారం తెలిపారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి క్వింటల్ పత్తి రూ.16,350లు చెల్లించేవిధంగ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ **ఘర్ ఘర్ కమల్ హర్ ఘర్ బీజేపీ**

జహీరాబాద్: రంజోల్ గ్రామంలోని శక్తి కేంద్రంలో బూత్‌స్థాయి కార్యకర్తలు ఇంటింటికీ కమలం పూవ్వు గుర్తు వేశారు. ఘర్ ఘర్ కమల్ హర్ ఘర్ బీజేపీ పేరుతో కార్యక్రమం నిర్వహించినట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పూల సంతోష్, నాయకులు విశ్వనాథ్‌యాదవ్, దుర్గేష్, బోడ రాజు, దత్తు, వెంకటేష్, గణేష్, సాయిప్రసాద్, శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కంటి వెలుగు



పైడిపల్లిలో నిర్వహిస్తున్న కంటి పరీక్షలు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని పలు గ్రామాల్లో కంటివెలుగు కొనసాగుతుంది. గురువారం పైడిపల్లి శిబిరంలో వైద్యాధికారి డా.విజయ్ కృష్ణా రెడ్డి, శోభ కంటి పరీక్షలు నిర్వహించారు. ఆశా కార్యకర్తలు జానకి, మమత, సంకీర్తన, పద్మ, మీన, డేటా ఎంట్రీ ఆపరేటర్ హరీశ్, అంగన్‌వాడీ చంద్రమ్మ పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుడు బస్తీబాట

న్యాల్‌కల్(జహీరాబాద్): టేకూర్‌లో గురువారం బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిద్ధు రావణ్ పర్యటించారు. బస్తీ బాటలో భాగంగా ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మిర్జాపూర్‌లో పశు వైద్య శిబిరం



టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

న్యాల్‌కల్(జహీరాబాద్): మిర్జాపూర్(ఎన్)లో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో అజింక్యా టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ 4 నుంచి 8 నెలల ఆడ లేగ దూడలకు బ్రుసెల్లోసిస్ వ్యాధి రాకుండా ఉండేందుకు టీకాలు వేస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది ఎంఏ ఘనీ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి మహారాష్ట్ర ప్రతినిధులు

జహీరాబాద్: 5న మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరగనున్న బీఆర్‌ఎస్ సభలో ఆ రాష్ట్ర ప్రతినిధులు, ప్రముఖులు పార్టీలో చేరనున్నారని డీఆర్‌యూసీసీ సభ్యుడు షేక్ ఫరీద్ అన్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఆవిర్భవించిన అనతికాలంలోనే అన్ని విధాలుగా అభివృద్ధి సాధించిందన్నారు.

రామలింగ చౌడేశ్వర మందిర వార్షికోత్సవం

సదాశివపేట(సంగారెడ్డి): భక్తిశ్రద్ధలతో పట్టణంలోని హట్కూర్‌పేట శ్రీరామలింగ చౌడేశ్వర మందిర వార్షికోత్సవ వేడుకలు గురువారం అంగరంగ వైభవంగ జరిగాయి. వార్షికోత్సవం సందర్భంగా అభిషేకం ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

వైద్య శిబిరం

రామాయంపేట(మెదక్): రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో గురువారం రామాయంపేటలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరాన్ని సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన సురక్ష కంటి ఆస్పత్రి వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈశిబిరంలో 112 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

కంటి వెలుగు ప్రారంభం



కౌడిపల్లి(నర్సాపూర్): అద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహ్మద్‌నగర్‌లో కంటి వెలుగు వైద్యశిబిరాన్ని ఎంపీపీ రాజు నాయక్, జెడ్పీటీసీ కవిత అమర్‌సింగ్ గురువారం ప్రారంభించారు. సర్పంచ్ దివ్యమహిపాల్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కంటి వెలుగును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని, 18 ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరు పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఉచితంగా వైద్యం చేసి మందులు, అద్దాలు పంపిణీ చేస్తున్నారని గ్రామస్తులు వైద్యసిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రామాగౌడ్, ఎంపీటీసీ సునీతకృష్ణ, ఉప సర్పంచ్ ఫారుక్, ఏఎన్ఎంలు రాజమణి, మజీదబేగం, తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వినోదరెడ్డి, ఎంపీడీఓ శశిప్రభ అన్నారు. గురువారం వారు మండల పరిధిలోని బ్ద్రాయ్యా తండాలో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుజ్జిబాయి, కార్యదర్శి మోహన్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తూప్రాన్: ప్రజలకు దృష్టి లోపాల నివారణ కోసమే ప్రభుత్వం ×కంటి వెలుగు× కార్యక్రమం నిర్వహిస్తుందని ఎంపీపీ స్వప్న అన్నారు. గురువారం మండలంలోని వట్టూరు గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుంధతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్ రూరల్: కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీపీఓ సాయిబాబా సూచించారు. గురువారం హవేళిఘనపూర్ మండలం తొగిట గ్రామంలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

రుణాలపై అవగాహన

నర్సాపూర్: డీసీసీబీ నర్సాపూర్ శాఖ ఆధ్వర్యంలో గురువారం కళాజాత ఆధ్వర్యంలో బ్యాంకు ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న రుణాలపై అవగాహన కల్పించారు. కళాజాత ప్రదర్శనను పట్టణంలోని శ్రీనల్లపోచమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. స్థానిక డీసీసీబీ శాఖ మేనేజర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ కృపాకర్‌రావుల ఆధ్వర్యంలో కళాజాత కళాకారులు పాటలు పాడుతూ.. నృత్యాలు చేస్తూ బ్యాంకులో ఖాతాదారులకు రుణాలపై అవగాహన కల్పించారు. పాడిపరిశ్రమకు, పౌల్ట్రీ, హౌసింగ్ తదితర రకాల రుణాలు, బంగారు ఆభరణాలపై అందుబాటులో రుణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు విజయలక్ష్మి, కృపాకర్‌రావు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది మహేష్, ప్రశాంత్, పీఏసీఎస్ సీఈఓ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



కళాజాత బృందంతో బ్యాంకు మేనేజర్ ఇతర సిబ్బంది

దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు సమ ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని ఏదుల్లాపూర్ పురాతన ఏదుల్లా హుస్సేన్ దర్గాకు గురువారం మున్నూరుకాపు రాష్ట్ర ఉపాధ్యాక్షుడు కల్లూరి హన్మంతరావు చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా దర్గా వద్ద మైనార్టీ మత గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ఏదుల్లాపూర్ దర్గాకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌చారి, సర్పంచ్ కీర్తన, ఉప తహసీల్దార్ ప్రభుదాస్, ఆర్ఐ కిషన్ ముత్యాలు పాల్గొన్నారు.